ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ సంపుటి : 18 సంచిక : 313 గురువారం, జులై 10, 2025 పేజీలు:4 వెల: 1 రూ/

Published from Hyderabad, Medak Nalgonda, Karimnagar, Warangal, Khammam




# కృష్ణా జలాల విషయంలో కేసీఆర్ నిర్ణయాలు

# ఓ మరణశాసనం

- మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, జగన్ బంధంతో తెలంగాణకు తీవ్ర నష్టం
- రాయలసీమకు మేలు చేసేలా కేసీఆర్ వ్యవహరించారని ఆరోపణ
- జూరాల నుంచే నీళ్లు తెచ్చుకుంటే ఏపీకి అవకాశం దక్కేది కాదు
- కేసీఆర్ వల్లే రాష్ట్రానికి విద్యుత్ భారం పెరిగిందన్న రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ :** మాజీ ముఖ్యమంత్రులు కె. చంద్రశేఖర్ రావు, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మధ్య ఉన్న అనుబంధం కారణంగా తెలంగాణకు పూడ్చలేని నష్టం జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. కృష్ణా జలాల విషయంలో కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలు రాష్ట్ర రైతాంగానికి మరణశాసనంగా మారాయని ఆయన ఆరోపించారు. బుధవారం కృష్ణా జలాలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అనంతరం సీఎం రేవంత్ ఈ వ్యాఖ్యలు చేశారు. “బేసిన్లు, బేషజాలు లేవంటూ కేసీఆర్ గతంలో అన్నారు. గోదావరి జలాలు సముద్రంలో కలుస్తున్నాయని, వాటిని కృష్ణా, పెన్నా బేసిన్లకు తరలించి రాయలసీమను రతనాల సీమ చేస్తానని చెప్పారు. ఇందులో భాగంగా జగన్‌కు సలహాలు ఇవ్వడమే కాకుండా, టెండర్లు, జీవోల విషయంలోనూ సహకరించారు” అని రేవంత్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రానికి వచ్చిన నీటిని వచ్చినట్లే ఒడిసి పట్టుకోవాల్సింది పోయి, ఏపీకి వెళ్లాక చివరిలో తీసుకోవడం వల్ల తెలంగాణ తీవ్రంగా నష్టపోయిందని ఆయన అన్నారు.తుంగభద్ర, కృష్ణా జలాలు మొదట గద్వాలలోని జూరాలకు వస్తాయని, అక్కడే పాలమూరు-రంగారెడ్డి, నల్గొండ ప్రాజెక్టులకు నీటిని తరలించి ఉంటే ఏపీ జలాలను కొల్లగొట్టే అవకాశం ఉండేది కాదని రేవంత్ అభిప్రాయపడ్డారు.

కేసీఆర్ తీసుకున్న తప్పుడు నిర్ణయాల వల్లే కృష్ణా పరివాహక ప్రాంత రైతులు నష్టపోయారని అన్నారు. “గత ప్రభుత్వం సరిగ్గా వాదించి ఉంటే హైదరాబాద్ తాగునీటి సమస్య తీరేది. అంతేకాకుండా, ప్రాజెక్టులలో రాష్ట్రానికి రావాల్సిన వాటా కోల్పోవడం వల్ల తక్కువ ధరకు లభించాల్సిన విద్యుత్‌ను కూడా కోల్పోయాం” అని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలకు మరణశాసనం రాసే హక్కు కేసీఆర్‌కు ఎవరిచ్చారని ఆయన ప్రశ్నించారు.

## నిరసనకారులను కాల్చిపారేయండి

### - షేక్ హసీనా ఆడియో లీక్

**ఢాకా :** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు సంబంధించిన ఒక కీలకమైన ఆడియో లీక్ కావడంతో రాజకీయంగా పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా గత సంవత్సరం జరిగిన ఆందోళనల సమయంలో నిరసనకారులపై కాల్పులు జరపాలని ఆమె స్వయంగా ఆదేశించినట్లు ఈ ఆడియోలో ఉంది. ఈ ఉదంతం ఇప్పుడు బంగ్లా రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. బీబీసీకి చెందిన పత్రాలను ఉటంకిస్తూ పలు

మిగతా 2లో



## విజయవాడ లెనిన్ సెంటర్ పేరు మార్చాలి

### - బీజేపీ కొత్త చీఫ్ మాధవ్ తొలి డిమాండ్



**అమరావతి** ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా అనూహ్యంగా ఎంపిక అయిన మాధవ్ పార్టీ పగ్గాలు చేపట్టారు. సుదీర్ఘ కాలం మాధవ్ కుటుంబం పార్టీకి చేసిన సేవలను గుర్తించి పార్టీ అధ్యక్షుడిగా ఎంపిక చేసారు. పలువురు ముఖ్య నేతలు రేసులో నిలిచినా చివరకు మాధవ్ కు పార్టీ బాధ్యతలు అప్పగించింది. పార్టీ చీఫ్ గా బాధ్యతలు చేపట్టిన తరువాత ర్యాలీ నిర్వహించారు. ఎన్డీఏ పార్టీల సమన్వయం గురించి కీలక వ్యాఖ్యలు చేసారు. అదే సమయంలో అధ్యక్షుడి హోదాలో తొలి డిమాండ్ తెర మీదకు తెచ్చారు.ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికైన పీవీఎన్ మాధవ్ విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. పార్టీ నేతలు, కార్యకర్తలతో బీజేపీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహిం చారు. లెనిన్ సెంటర్ లో

మిగతా 2లో

## ఓవైసీ కాలేజీని మాత్రమే వదిలేశాం

- సామాజిక ప్రయోజనాలే కీలకమన్న రంగనాథ్ - అందుకే ఫాతిమా కాలేజీ కూల్చటం లేదు
- ఎంఐఎం నేతల నుంచి వెయ్యి కోట్ల ఆస్తులు రికవరీ చేశాం - హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్లారిటీ



**హైదరాబాద్** హైదరాదాబ్ సకలం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న ఓవైసీ ఫాతిమా కాలేజీని ఎందుకు కూల్చివేయటం లేదన్న ప్రశ్నకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టత ఇచ్చారు. ఈ కాలేజీ ఫుల్ ట్యాంక్ లెవెల్‌లో నిర్మించినందున గత సెప్టెంబర్‌లో తొలగిస్తామని చెప్పినప్పటికీ సామాజిక కారణాలవల్లే కూల్చివేతను నిలిపివేశామని ఆయన వివరించారు. ఈ అంశంపై బీజేపీ నాయకులు ముఖ్యంగా ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పిస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదల ఇండ్లు మాత్రమే కూల్చుతుందని, కాంగ్రెస్, ఎంఐఎం నేతల భవనాల జోలికి వెళ్లడం లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. హైడ్రా వ్యవస్థ ఎవరి ప్రయోజనాల కోసం ఏర్పాటు చేశారో రేవంత్ సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో కమిషనర్ వివరణ ప్రాధాన్యత సంతరించుకుంది. ‘ ఫాతిమా కాలేజీ పేద ముస్లిం మహిళల కోసం కేజీ నుంచి పీజీ వరకు విద్యను అందిస్తోంది. ఇక్కడ ఎలాంటి ఫీజులు వసూలు చేయరు. 10,000 మందికి పైగా బాలికలు, యువతులు ఈ సంస్థలో విద్యను అభ్యసిస్తూ, వెనుకబాటుతనం నుంచి విముక్తి పొందుతున్నారు. పేదల కోసం పనిచేస్తున్న కాలేజీ అయినందునే దానిపై చర్యలు తీసుకోవడానికి వెనుకా ముందు ఆడుతున్నాం. సామాజిక స్పృహతో కాలేజీ నడుస్తుందని, దాని పట్ల

మిగతా 2లో

## కరీంనగర్‌లో

# మోదీ గిఫ్ట్ ప్రారంభం

### - 20,000 సైకిళ్ల పంపిణీ

**హైదరాబాద్** కరీంనగర్‌లో కేంద్ర ప్రభుత్వం తరఫున మోదీ గిఫ్ట్ కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభమైంది. “లక్ష్యమొకటే %-% విద్య అభివృద్ధి” అనే నినాదంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సైకిళ్లు, మోదీ కిట్లు పంపిణీ కార్యక్రమాన్ని కేంద్ర మంత్రి బండి సంజయ్ చేపట్టారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వీడియోను ఆయన తన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. తొలి దశలో జిల్లా వ్యాప్తంగా 20,000 సైకిళ్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మొదటి తరగతి నుంచి ఆరో తరగతి చదువుతున్న ప్రతి విద్యార్థికి ఈ మోదీ కిట్లను అందజేస్తున్నారు. ఈ కిట్లలో స్కూల్ బ్యాగ్, వాటర్ బాటిల్, నోట్‌బుక్స్ సహా విద్యకు అవసరమైన అన్ని వస్తువులు ఉన్నాయి. అవకాశం ఉన్నంత కాలం ప్రతి ఏడాది ఇదే విధంగా సైకిళ్ల పంపిణీ కొనసాగుతోందని బండి సంజయ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు స్కూల్‌కు వచ్చేందుకు మరింత వీలవుతుందని తెలిపారు.
ఈ సందర్భంగా బండి సంజయ్

మిగతా 2లో



## క్లబ్‌లు, పబ్‌లకు పిలవొద్దు

# చట్టసభలకు రండి చర్చిద్దాం

### - కేటీఆర్‌కు రేవంత్ రెడ్డి కౌంటర్

**హైదరాబాద్** కృష్ణా, గోదావరి జల అంశాలపై చట్టసభల్లో చర్చకు రావాలని సూచించాం కానీ వీధుల్లో, క్లబ్బుల్లో, పబ్బుల్లో కాదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజాభవన్ లో బనకచర్ల అంశంపై ప్రజాప్రతినిధులకు ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆ తర్వాత సీఎం మాట్లాడారు. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్ష నేత అసెంబ్లీకి రావాలని సూచించాం కానీ సవాల్ చేయలేదన్నారు. కృష్ణా, గోదావరి జలాలపై అసెంబ్లీలో చర్చిద్దామన్నానని చెప్పానన్నారు.

కానీ ఒకాయన ప్రెస్ క్లబ్ కు వెళ్లి చర్చకు రమ్మని సవాల్ చేశారని ఇకనైనా వీధులు, పబ్బులు, క్లబ్బులు కాకుండా చట్టసభల్లో చర్చకు రావాలన్నారు. తనను సవాల్ చేసిన వ్యక్తి పేరు ఎత్తడం కూడా తనకు ఇష్టం లేదని కేటీఆర్ గురించి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానిచారు.



## హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహనరావు అరెస్ట్

వార్త 2లో




## హైదరాబాద్‌లో కల్తీ కల్లు కలకలం

- కల్తీ కల్లు ఘటనలో 4కు చేరిన మృతుల సంఖ్య
- నిమ్స్‌లో 22 మందికి చికిత్స అందిస్తున్న వైద్యులు

**హైదరాబాద్** హైదరాబాద్ నగరంలోని కూకట్పల్లిలో కల్తీకల్లు సేవించిన ఘటనలో మృతుల సంఖ్య మూడుకు చేరింది. కల్తీ కల్లు ఘటనలో చికిత్సపొంది

మిగతా 2లో



# ప్రసన్న కుమార్ రెడ్డి హత్యకు కుట్ర

**నెల్లూరు** నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డినీ చంపాలని కుట్ర చేశారని వైకాపా నేత, మాజీ ఎమ్మెల్యే అనిల్ కుమార్ యాదవ్ ఆరోపించారు. బుధవారం అయన మీడియాతో మాట్లాడారు. నల్లపరెడ్డి ఇంటిమీద దాడి తో నెల్లూరు జిల్లా ఉలిక్కిపడింది. ఫ్యాక్షన్ ప్రాంతంగా నెల్లూరును వేమిరెడ్డి దంపతులు ఈ ఘటనతో మార్చేశారు. కూటమి ప్రభుత్వంలో ప్రణాళికాబద్ధంగా ఒకరి తరువాత ఒకరిపై కేసులు,దాడులు జరుగుతున్నాయి. దాడి ఘటన నేపథ్యంలో నిందితులపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలని కోరామని అన్నారు. ప్రశాంతమ్మ నిన్న చేసిన వ్యాఖ్యల్లో అనేక తేడాలు ఉన్నాయి... ఆమె వ్యాఖ్యలు అనేక అనుమానాలకు తావిస్తున్నాయి. - ప్రసన్న ను చంపాలనే లక్ష్యంతోనే దాడి చేసినట్లు ప్రశాంతమ్మ మాటలను బట్టి అర్థం అవుతోంది. దీనిపై ఎల్లో మీడియా కూడా ఏమాత్రం పొసగని వార్తలు ప్రసారం చేసింది. ఇంట్లోవాళ్లను భయభ్రాంతులకు గురి చేసేలా ఈ దాడులు జరిగాయి. ప్రసన్న తనకు తానే దాడులు చేయించుకున్నారని ప్రశాంతమ్మ ఆరోపణలు చేయడం సిగ్గుచేటని అన్నారు. సీసీ ఫుటేజీని పరిశీలిస్తే ప్రసన్నను అంతం చేయాలనే లక్ష్యం కనిపిస్తోంది. పోలీసులు వెళ్లే సమయానికి దుండగులు విధ్వంసం చేస్తుంటే కనీసం ఒకరిని కూడా పట్టుకోలేదు... ఇది నల్లపరెడ్డికి అంతం చేయాలనే కుట్రగా భావిస్తున్నాం. దీనిపై పవన్ ట్వీట్ చేయడం సిగ్గుచేటు. ఆయన ఇంట్లో మహిళలు లేరా... వాళ్ళని కూడా బెదిరిస్తే చూస్తూ ఊరుకుంటారా. దాడి సమయంలో శ్రీనివాసులురెడ్డి సతీమణి ఉంటే ఆమెని కూడా బెదిరించారు. రాజకీయాల్లో ఆదర్శంగా నిలిచిన నల్లపరెడ్డి కుటుంబానికి ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. టీడీపీ కన్వీనర్లు,నాయకులే దాడులు చేస్తే వారిని అరెస్టు చేయకుండా.. ప్రసన్నపై కేసులు పెట్టడం దారుణం. వేమిరెడ్డి దంపతులతో పాటు, దాడికి పాల్పడిన వారిపై కేసులు ఎందుకు పెట్టరు... కుట్రదారులపై హత్యాయత్నం కేసు పెట్టాలి. గతంలో రోజాను ఇంకా చాలామంది వైసీపీ మహిళలపై తప్పుగా మాట్లాడలేదా... మరి అప్పుడు మేము దాడులు చేయలేదు. నెల్లూరులో ఇలా దాడులు చేయడం చాలా దారుణం... కూటమి ప్రభుత్వం వచ్చింది ఇందుకేనా. ప్రసన్నపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసింది ప్రశాంతమ్మ.... ప్రశ్నిస్తే ఆయనపై దాడులు చేసి చంపాలని కుట్రలు చేస్తారా. - ప్రశాంతమ్మకు గౌరవించడం రాదా... ఎలా మాట్లాడాలి అనే సంస్కారం లేదా.- ప్రసన్నపై ఎలాగైతే కేసులు పెట్టారో వేమిరెడ్డి ఖీ దంపతులపై కూడా కేసులు కట్టాలని అయన అన్నారు.

# విద్యార్థులను సొంత పిల్లలగా భావించాలి

**సిద్ధిపేత** నేను ఒకప్పుడు టీచర్ నే. విద్యార్థులను సొంత పిల్లగా భావించాలని జిల్లా కలెక్టర్ కే. హేమావతి ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం జిల్లా కలెక్టర్ తొగుట మండల కేంద్రంలో పర్యటించి ఇందిరమ్మ ఇళ్లకు మార్కింగ్ ను మరియు నిర్మాణ ప్రగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా కంకర, ఇసుక, రాడ్ అన్ని సమపాళ్లలో కలిపి పది కాలాలపాటు మన్నికగా ఉండేలా ఇళ్ల నిర్మాణాలను దగ్గర ఉండి కట్టించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు.అనంతరం తొగుట జడ్పీ హైస్కూల్ ను సందర్శించి మధ్యాహ్న భోజనం పరిశీలించారు. మెనూ ప్రకారం కాకుండా ఒక కూర మరియు గుడ్డు మాత్రమే ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేసి వివరాలను డీఈఓ కు పంపించాలని ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డిని ఆదేశించారు. మధ్యాహ్నం భోజనం చేస్తున్న విద్యార్థులతో మాట్లాడి భోజనం రుచికరంగా ఉందా అని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు ఆరోగ్యంగా ఎదిగేందుకు ప్రభుత్వం రోజువారి మెనూ ను మధ్యాహ్న భోజనం కోసం రూపొందించ్చిందని నేను మళ్ళీ వస్తానని మెనూ ప్రకారం భోజనం లేకుంటే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. అలాగే నేను ఒకప్పుడు టీచర్ నే అని విద్యార్థులను సొంత పిల్లలుగా భావించి విద్యాబుద్ధులు నేర్పి భావి వి పౌరులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ పర్యటనలో తొగుట తాసిల్దార్ శ్రీకాంత్, ఎంఈఓ నర్సయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపేందర్ తదితరులు ఉన్నారు.

# రాజధాని అమరావతి నిర్మాణ స్ఫూర్తితో తుడాను అభివృద్ధి చేస్తున్నాము

.రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రి లోకేష్ బాబులు అహర్నిశలు శ్రమిస్తున్నారని వారి శ్రమలో భాగం పంచుకోవాలన్న సంకల్పంతో తాను తుడా చైర్మన్ గా బాధ్యతలు చేపట్టి తుడా పరిధిలో ప్రజలకు కావలసిన మౌలిక వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తూ రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతున్నానని తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి అన్నారు. తుడా చైర్మన్ గా డాలర్స్ దివాకర్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత తుడా పరిధిలో లేవుట్ అప్రూవల్, భవన నిర్మాణాల అనుమతులు, అమలు తదితర అంశాల పై గతంలో ఎన్నడు లేని విధంగా రాష్ట్ర చరిత్రలో మొదటిసారి 4 మున్సిపాలిటీలు, 9 నియోజకవర్గాలు, 39 మండలాల ఎంపిడిఓ లు , 1100 పైగా గ్రామపంచాయతీల కార్యదర్శులకు అవగాహన సదస్సు బుధవారం తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి, తుడా వైస్ చైర్మన్ జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు, జిల్లా ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువంశీ, డివిజనల్ పంచాయతీ ఆఫీసర్ సురేష్ నాయుడు, మున్సిపల్ డిప్యూటీ సిటీ ప్లానర్ మహబూబ్ ఖాన్,తుడా సెక్రెటరీ శ్రీకాంత్, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తుడా సిటీ ప్లానింగ్ ఆఫీసర్ దేవీ కుమారి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పంచాయతీ పరిధిలో కార్యదర్శులు అక్రమ లేఅవుట్లు ఎలా గుర్తించాలి, ఎలా అనుమతులు ఇవ్వాలి. భవన నిర్మాణాల అనుమతులు తదితర అంశాలను కులం కుశంగా వివరించారు. అదేవిధంగా పంచాయతీ కార్యదర్శుల అనుమానాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తిరుపతి నగరానికి శ్రీవారి దర్శనర్థం ప్రతిరోజు లక్షలాదిమంది ప్రజలు వస్తున్నారని వారు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ప్రశాంతంగా దైవదర్శనం చేసుకొని సంతోషంగా తిరిగి వెళ్ళేవిధంగా అన్ని సౌకర్యాలు తుడా కల్పిస్తుందని స్పష్టం చేశారు. అంతేకాక పరిధిలో రాజధాని అమరావతి నిర్మాణం సరవేగంగా జరుగుతోంది దానిని స్ఫూర్తిగా తీసుకొని తుడా పరిధిలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు మంత్రి లోకేష్ గారు కష్టపడుతున్నారని వారి కష్టంలో భాగం కావాలన్న సంకల్పంతో తుడా అభివృద్ధికి కష్టపడుతున్నామన్నారు. గత పాలకులు తుడాను భ్రష్టుపట్టించారని మండిపడ్డారు. తాను తుడా ఛైర్మన్ అయ్యాక తుడా ను గాడిలో పెడుతున్నామని పేర్కొన్నారు. తుడా పరిధిలోని అన్ని గ్రామపంచాయతీ పరిధిలలో ప్రజలకు అవసరమైన డ్రైనేజీలు,రోడ్లు, డ్రైన్లు, కరెంటు సౌకర్యం ఏర్పాటు చేయడానికి తుడా కృషి చేస్తుందని చెప్పారు. అక్రమ లేవుట్స్ వలన క్రైమ్ రేటు పెరుగుతోందని, ప్రజలు అక్రమ లేవుట్స్ లో స్థలాలు కొని ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శులు లేవుట్, భవన నిర్మాణాల అనుమతులు, తుడా నియమ నిబంధనలు తెలుసుకొని తుడా అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. గ్రామపంచాయతీలు, మండలాలు,జిల్లాల అభివృద్ధిలో గ్రామపంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమైనదని వారి హోదాకు ఎలాంటి భంగం కలగకుండా చూసుకుంటామన్నారు.తుడా వైస్ చైర్మన్ శుభం బన్సల్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమైనదని ప్రభుత్వ జీవోలను క్షుణ్ణంగా తెలుసుకుని వాటిని అమలు చేయాలని కోరారు. తుడా కు అదే విధంగా పంచాయతీ కార్యదర్శుల మధ్య ఉన్న కమ్యూనికేషన్ గ్యాప్ ను పూరిస్తామని చెప్పారు. తుడా భివృద్ధికి పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని కోరారు.

# సమాజ ప్రగతిలో యువత ముందుండాలి



**కాకినాడ** యువత తమ ప్రతిభను పదును పెట్టి సమాజం దృష్టిలో ఆలోచిస్తూ నైతిక విలువలతో క్రియాశీలక పాత్ర పోషించాలని కాకినాడ ఐడిఎ కార్యదర్శి డాక్టర్ అద్దాల సత్యనారాయణ పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్టు మరియు కాకినాడ ఐడిఎ ఆధ్వర్యంలో జాతీయ విద్యార్థుల దినోత్సవం పురస్కరించుకుని జరిగిన కార్యక్రమం ఉద్దేశించి ఆయన మాట్లాడారు. క్లబ్బులు, పబ్బులు, సినిమాలు, షికార్లు, సెల్ ఫోన్, ఇంటర్నెట్ తదితర వాటికి బందీ కాకుండా చక్కగా చదువుకుంటూ బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని అన్నారు. నిరాశ నిస్పృహలకు లోను కాకుండా, కష్టాలకు, వైఫల్యాలకు కృంగిపోరాదని అన్నారు. తల్లిదండ్రులు రాత్రింబవళ్లు కష్టపడి పైసా పైసా సంపాదించి పిల్లలను చదివిస్తున్నారు కాబట్టి వారికి అపకీర్తి తేరాదని అన్నారు. తాత్కాలిక ఆకర్షణ, ఆనందం కోసం విద్యార్థులు బంగారు జీవితాన్ని పాడు చేసుకోకుండా ముందుకు సాగాలని అన్నారు. అవకాశం ఉన్న మేరకు మంచి పనులు చేయడానికి ప్రయత్నించాలని డాక్టర్ అద్దాల తెలిపారు. తొలుతగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న , బుద్ధ రాజు సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు శాపంగా మారిన

# నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలి




**దేవనకొండ** కార్మికులకు శాపంగా మారిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, 12 గంటల పని విధానాన్ని రద్దుచేసి, ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కే.మద్దిలేటి శెట్టి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బి. వీరశేఖర్, ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే. తిమ్మయ్య, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర లు డిమాండ్ చేశారు. బుధవారం వామపక్ష కార్మిక సంఘాల పిలుపు మేరకు దేశవ్యాప్త సమ్మెకు మద్దతుగా దేవనకొండ లో అంగన్వాడి, ఆశ, హమాలి, ఆటో,రైతు, వ్యవసాయ కూలీలతో కలిసి హోర్తల్ కార్యక్రమాన్ని ఏఐటియుసి, సిఐటియు జిల్లా నాయకులు ఎం. నరసరావు,ఎం.అశోక్ అధ్యక్షతన స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నందు దాదాపు గంటసేపు రాస్తారోకో కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం ఉద్దేశించి నాయకులు మాట్లాడుతూ..... కేంద్రంలో 11 సంవత్సరాల నుండి బిజెపి ప్రభుత్వం పరిపాలన చేస్తున్నదని, రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, మహిళల చట్టాలను కాలరాస్తున్నారని, ఎన్నో ఏళ్లుగా పోరాటం చేసి సాధించుకున్న చట్టాలను కూడా రద్దు చేసి,వాటి స్థానంలో కొత్త చట్టాలను తీసుకొచ్చి రైతులను, కార్మికులను,వ్యవసాయ కూలీల నడ్డి విరిచేలా చేస్తున్నారని ఆయన ఆరోపించారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఆదాని, అంబానీ లాంటి కార్పొరేట్లకు ఈ దేశ సంపదను అప్పనంగా అప్పజెప్తున్నారని అన్నారు. దేశంలో పేదలకు ఉపయోగపడే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసి,చాప కంద నీరులా నీరుగారిస్తూ, కుట్రలు చేసి ఎత్తివేసే ప్రయత్నాలు బిజెపి ప్రభుత్వం చేస్తున్నదని ఆయన మండిపడ్డారు. ఉపాధి హామీ చట్టం రక్షణ కోసం ఎన్ని త్యాగాలకైనా సిద్ధపడాలని వారు పిలుపునిచ్చారు. రైతులకు ఉరితాళ్ళులా తయారైన మూడు నల్ల చట్టాలు మరియు కార్మికుల పొట్టలు కొట్టే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధితోపాటు సంక్షేమ కార్యక్రమాలు అందించాలని గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు ఉండేలా చూడాలని, డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇచ్చి పేదలకు ప్రభుత్వమే గృహ నిర్మాణం చేపట్టాలన్నారు. భూములేని ప్రతి నిరుపేద కుటుంబానికి రెండు ఎకరాలు భూమి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేదలకు ఆహార భద్రత కల్పించి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందించే రేషన్ బియ్యం ప్రతి ఒక్కరికి 10 కేజీలకు పెంచాలని, అన్ని రకాల నిత్యవసర వస్తువులు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా చేపట్టాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని కాపాడాలని, దళిత ఆదివాసి మహిళల హక్కులను కాపాడాలని, మతోన్మాదానికి దూరంగా పేదలను ఉంచాలని, బలహీన వర్గాల పై జరుగుతున్న దాడులను ఆపాలని అన్నారు. వ్యవసాయ కార్మికులకు సామాజిక భద్రత మరియు సంక్షేమ చర్యలను అందించడానికి ప్రభుత్వం ముందుకు రావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు శ్రీదేవి తులసమ్మ నాగవేణి అనిత బడే సాహెబ్ రఫీ గోపాల్ గంగన్న వీరాస్వామి రామాంజి బజారి, గాజుల శ్రీనివాసులు, కోదండ హనుమప్ప సుబ్బయ్య శెట్టి యూసుఫ్ బాషా, మహబూబ్ బాషా, సూరి, నాగేష్ ,పాండు, రాయుడు నాగేంద్ర శ్రీనివాసులు జ్యోతిలక్ష్మి లక్ష్మీదేవి మంగమ్మ వీరేంద్ర బడే సాబ్ సుధాకర్ పురుషోత్తం అనేక మంది మహిళలు కూడా పాల్గొన్నారు.

# ఏఐ ఆధారిత స్ట్రైకర్ మాకో రోబోటిక్ సర్జరీ సిస్టమ్‌ను ప్రారంభించిన కేర్ ఆసుపత్రి



**హైదరాబాద్** వైద్య రంగంలో మరో ముందడుగు కేర్ హాస్పిటల్ హైటెక్ సిటీ వారు అత్యాధునిక ఏఐ ఆధారిత స్ట్రైకర్ మాకో రోబోటిక్ సర్జరీ సిస్టమ్ ను ప్రారంభించారు.. ఇది తెలంగాణలో రోబోటిక్ జాయింట్ రీప్లేస్మెంట్ శస్త్రచికిత్సలకు ఒక కొత్త సూచకం... ఈ సాంకేతికతను శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మరియు క్వాలిటీ కేర్ ఇండియా లిమిటెడ్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ ఖన్నా లతో కలిసి ప్రారంభించారు.. ఈ కార్యక్రమంలో కేర్ హాస్పిటల్స్ గ్రూప్ చీఫ్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ నిఖిల్ మాథుర్, చీఫ్ సేల్స్ అండ్ మార్కెటింగ్ ఆఫీసర్ శలభ్ డాంగ్, ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్లు డాక్టర్ అశోక్ రాజు గొట్టెముక్కల, డాక్టర్ వాసుదేవ జువ్వాడి, డాక్టర్ జగన్ మోహన్ రెడ్డి, డాక్టర్ శరత్ బాబు ఇతర సీనియర్ డాక్టర్లు మరియు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాకొ రోబో కీళ్ల మార్పిడి శస్త్రచికిత్స వల్ల రోగులు త్వరగా కోలుకుంటారన్నారు.. ఈ కార్యక్రమం ద్వారా కేర్ హాస్పిటల్స్ అధునాతన సాంకేతికతను తీసుకురావడంలో, రోగుల అవసరాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడంలో తన నిబద్ధతను చూపుతోందన్నారు... రోగులకి మెరుగైన ఫలితాలు అందించడంలో, మరియు వైద్యరంగంలో ఉన్నత ప్రమాణాలను స్థాపించడంలో కేర్ హాస్పిటల్స్ చేస్తున్న కృషిని అభినందించారు... ఇది ముఖ్యంగా మొత్తం మోకాలి, పాక్షిక మోకాలి, తుంటి మార్పిడి శస్త్రచికిత్సలలో ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. దీని వల్ల రోగులు త్వరగా కోలుకోవచ్చు, నొప్పి తక్కువగా ఉంటుంది, అలాగే మంచి దీర్ఘకాలిక ఫలితాలు అందుతాయన్నారు... ఆరోగ్యరంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), రోబోటిక్స్ కీలకంగా మారుతున్నాయని, ఏఐ, రోబోటిక్స్ ఇక భవిష్యత్ సాంకేతికత కాదు ఇవే ఇప్పుడు జరుగుతున్న యథార్థం. ఇవి ఖచ్చితమైన వైద్యం, శస్త్రచికిత్సా విధానాలను ఆచ్యర్య పరిచే దిశగా వేగంగా మార్పులు తీసుకొస్తున్నాయని తెలిపారు... భవిష్యత్తులోనూ రోబోటిక్స్, ఏఐ సహాయంతో మరింత మెరుగైన వైద్యం అందించేందుకు ఆసుపత్రులు, వైద్యులకు సహకరించడం మా లక్ష్యం అని చెప్పారు.

## సాగు చేసిన పంటలకి పంటల

# బీమా నమోదు చేసుకోండి

**పత్తికొండ** పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో భాగంగా నలకదొడ్డి మరియు చిన్నహుల్తి గ్రామాలలో రైతులతో గ్రామసభ నిర్వహించడం జరిగినది 2025 ఖరీఫ్ కాలానికి పంటల బీమా నమోదు చేసుకొనుటకు జూలై 31 వ తారీకు ఆఖరి తేదీన కావున నమోదు చేసుకోగలరని రైతులకు తెలియజేయడం




జరిగినది దీనిలో భాగంగా ఖరీఫ్ పంట కాలంలో సాగుచేసిన పంట ప్రకారంగా పంట బీమా హెక్టారుకు రైతు వాటాను బీమా ప్రీమియంను తెలియజేయడం జరిగినది కర్నూలు జిల్లా లో నీ అన్ని మండలాలలో సాగు చేసే పంటలపై రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ వారు బీమా ప్రీమియం ని నమోదు చేసుకోవడం జరిగింది. మీ సమీప రైతు సేవా కేంద్రంలోని సిబ్బందిని కలిసి మీరు సాగు చేసిన పంటల వివరాలను నమోదు చేసుకొని కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా పంటల బీమాను నమోదు చేసుకోవాల్సిందిగా రైతులందరికీ తెలియజేయడం జరిగినదిఅలాగే పత్తి మరియు వేరుశనగ పంటకి బీమా నమోదు చేసుకొనుటకు జూలై 15 తేదీ వరకు అతి తక్కువ గడువు ఉన్నందున రైతులు దీనిని గమనించి పత్తి వేరుశనగ సాగు చేసిన రైతులందరూ త్వరగా ఉపయోగించుకోగలరని తెలియజేయడం జరిగినదిపంటల వారీగా బీమా చెల్లించే ప్రీమియంను పట్టిక ద్వారా కింద తెలియపరచడం జరిగినది

# హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహనరావు అరెస్ట్

## - విజిలెన్స్ నివేదిక ఆధారంగా సీఐడీ చర్యలు

హైదరాబాద్ ఐపీఎల్ టిక్కెట్లకు సంబంధించి హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ), సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు (ఎస్‌ఆర్‌హెచ్) వివాదంలో సీఐడీ చర్యలు చేపట్టింది. ఐపీఎల్ సందర్భంగా టిక్కెట్ విషయంలో హెచ్‌సీఏ బెదిరింపులకు పాల్పడినట్టు ఎస్‌ఆర్‌హెచ్ ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు చేసిన సీఐడీ, హెచ్‌సీఏ ఛైర్మన్ జగన్మోహనరావుతో పాటు మరొకరిని అరెస్ట్ చేసింది. విజిలెన్స్ నివేదిక ఆధారంగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌పై సీఐడీ కేసు నమోదుచేసింది. హెచ్‌సీఏలో భారీగా అక్రమాలు జరిగినట్టు గుర్తించిన విజిలెన్స్ చర్యలకు సిఫార్సు చేసింది. లక్నోతో మ్యాచ్ సందర్భంగా వీఐపీ గ్యాలరీకి హెచ్‌సీఏ తాళాలు వేసింది. హెచ్‌సీఏ ద్వారా రిక్వెస్ట్ పెడితే.. 10 శాతం టిక్కెట్లు ఇవ్వడానికి సన్‌రైజర్స్ అంగీకరించింది. కానీ, తనకు వ్యక్తిగతంగా టిక్కెట్ ఇవ్వాలని జగన్మోహన్ రావు డిమాండ్ చేసినట్టు తేలింది. అడిగినన్ని టిక్కెట్లు ఇవ్వకుంటే మ్యాచ్ జరగనివ్వనని బెదిరించారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ విశాఖపట్నాన్ని తమ హోమ్ గ్రౌండ్ చేసుకోవాలంటూ ఆఫర్ కూడా ఇవ్వడం గమనార్హం. ఒకానొక దశలో తమ హోమ్ గ్రౌండ్ అయిన ఉప్పల్ స్టేడియాన్ని వదిలి వెళ్తామంటూ సన్‌రైజర్స్ అసహనాన్ని వ్యక్తం చేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఈ వ్యవహారంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఆరోపణలపై దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పాస్‌ల విషయంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్రకటన చేయడం కలకలం రేగింది. ఐపీఎల్ ఒప్పందం ప్రకారం హెచ్‌సీఏకు 10 శాతం ఉచిత టిక్కెట్లు సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఎస్‌ఆర్‌హెచ్ ఇవ్వాలి. అందులో భాగంగా 50 టిక్కెట్ల సామర్థ్యం ఉన్న కార్పొరేట్ బాక్స్‌ను హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు కేటాయించారు. కానీ, ఈ సీజన్‌లో ఆ బాక్స్ సామర్థ్యం 30కి తగ్గిపోయిందని, అదనంగా మరో 20 టిక్కెట్లు కావాలని హెచ్‌సీఏ డిమాండ్ చేసింది. దీనిపై ఎస్‌ఆర్‌హెచ్ ప్రతినిధులు చర్చిద్దామని చెప్పగా లక్నోతో మ్యాచ్ సందర్భంగా హెచ్‌సీఏ అధికారులు వారి కార్పొరేట్ బాక్స్‌కు తాళం వేశారు. 20 టిక్కెట్లు ఇస్తేనే తాళం తీస్తామని ఒత్తిడి తెచ్చిందని ఆరోపణలు వచ్చాయి. సీఎం ఆదేశాలతో విజిలెన్స్ దర్యాప్తు చేపట్టి నివేదికను అందజేసింది. ఈ సిఫార్సుల ఆధారంగానే సీఐడీ కేసు నమోదుచేసి తాజాగా ఇద్దర్ని అరెస్ట్ చేసింది.

# నిరసనకారులను కాల్చిపారేయండి

అంతర్జాతీయ మీడియా సంస్థలు ఈ వార్తను ప్రచురించాయి. దీని ప్రకారం, గత సంవత్సరం జులై 18న ఢాకాలోని తన అధికార నివాసం 'గణభబన్' నుంచి ఒక ఉన్నత పోలీస్ అధికారికి హసీనా ఫోన్‌లో ఈ ఆదేశాలు జారీ చేశారు. "నిరసనకారులను అణచివేయడానికి ప్రాణాంతక ఆయుధాలు వాడండి. వాళ్లు ఎక్కడ కనిపిస్తే అక్కడ కాల్చేయండి" అని ఆమె ఆదేశించారు. ఈ ఆదేశాలు జారీ అయిన కొద్ది గంటలకే పోలీసులు నిరసనకారులపై బలప్రయోగం చేసినట్లు బీబీసీ నివేదిక వెల్లడించింది. కాగా, బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలు హింసాత్మకంగా మారి తీవ్ర అల్లర్లకు దారితీశాయి. ఈ ఘర్షణల్లో సుమారు 1,400 మంది మరణించినట్లు ఐక్యరాజ్యసమితి అంచనా వేసింది. ఈ నిరసనలు తీవ్రరూపం దాల్చడంతో హసీనా ప్రభుత్వం కుప్పకూలింది. అనంతరం ఆమె దేశం విడిచి భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. ప్రస్తుతం మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం హసీనాను తిరిగి దేశానికి రప్పించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఆమెపై బంగ్లాదేశ్‌లో ఇప్పటికే పలు కేసులు నమోదయ్యాయి. కోర్టు ధిక్కరణ కేసులో అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్ ఆమెకు ఆరు నెలల జైలు శిక్ష విధించడం కూడా గమనార్హం.

# విజయవాడ లెనిన్ సెంటర్ పేరు మార్చాలి

విశ్వనాథ సత్యనారాయణ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిం చారు. పార్టీ కార్యాలయంలో మాజీ అధ్యక్షురాలు, బీజేపీ ఎంపీ పురంధరేశ్వరి మాధవ్‌కు అధ్యక్ష బాధ్యతలను అప్పగించారు. అనంతరం మాధవ్ ఏపీ నూతన బీజేపీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. కూటమి పార్టీల సమన్వయంపై కీలక కామెంట్స్ చేశారు. పార్టీలో అందరినీ కలుపుకొని ముందకెళ్తానని మాధవ్ అన్నారు. ఏ నిర్ణయం తీసుకున్నా పార్టీలో అందరి నేతలతో చర్చించి తీసుకుంటానని మాధవ్ వెల్లడించారు.రాష్ట్రంలో బీజేపీ బలోపేతానికి అందరి సలహాలు, సూచనలు తీసుకుంటానని చెప్పారు. కూటమి పార్టీలను సమన్వయం చేసుకుంటూ పార్టీని ముందుకు తీసుకొని వెళ్తానని చెప్పారు. కూటమి పార్టీలపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేస్తానని వెల్లడించారు. ఇదే సమయంలో కొత్త డిమాండ్ తెర మీదకు తెచ్చారు. విజయవాడలో లెనిన్ సెంటర్‌కు విశ్వనాథ సత్యనారాయణ పేరు పెట్టాలని మాధవ్ డిమాండ్ చేసారు. లెనిన్ కు మన ప్రాంతానికి ఏంటి సంబంధమని ప్రశ్నించారు.

మన దేశానికి ఎలాంటి సంబంధం లేనప్పుడు లెనిన్ పేరు పెట్టాల్ సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. లెనిన్ సెంటర్ పేరు మార్చి విశ్వనాథ సత్యనారాయణ పేరు పెట్టాలని మాధవ్ ఈ సందర్భంగా డిమాండ్ చేసారు. దీంతో, ఇప్పుడు బీజేపీ రాష్ట్ర అధ్య క్షుడి హోదాలో చేసిన ఈ డిమాండ్ ఎంత వరకు అమలు అవుతుందనేది ఆసక్తి కరంగా మారు తోంది.

# కరీంనగర్‌లో మోదీ గిఫ్ట్ ప్రారంభం

మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఇంతటితో ఆగదని, కరీంనగర్‌లో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మోదీ కిట్స్ పంపిణీ చేస్తామని తెలిపారు. సైకిళ్ల కార్యక్రమం పూర్తయిన తర్వాత మోదీ కిట్స్ కార్యక్రమం ప్రారంభిస్తామన్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఎంత మంది విద్యార్థులు ఉంటే ఎన్ని లక్షల మంది ఉన్నా వాళ్లందరికీ మోదీ కిట్స్ అందజేస్తామని ఆయన తెలిపారు. వీలైనంత త్వరగా ఈ కిట్లు అందజేస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు అన్ని వసతులు కల్పించడమే తన ధ్యేయమని బండి సంజయ్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు దేనికీ భయపడకూడదని, వాళ్లకి అన్ని అందించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

# ఓవైసీ కాలేజీని మాత్రమే వదిలేశాం

మెతకవైఖరి అవలంబిస్తున్నాం.' అని ఏవీ రంగనాథ్ పేర్కొన్నారు.ఎంఐఎం నాయకుల అక్రమ ఆస్తుల వ్యవహారంలో తాము కఠినంగానే వ్యవహరిస్తున్నామని కమిషనర్ స్పష్టం చేశారు. ఎంఐఎం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కబ్జా చేసిన భారీ నిర్మాణాలను కూల్చివేశామని తెలిపారు. అంతేకాకుండా 25 ఎకరాల సరస్సును ఫ్లాట్‌గా మార్చిన ఓవైసీ కుటుంబానికి సన్నిహితుడి కట్టడాలను కూడా కూల్చివేశామన్నారు. ఎంఐఎం నాయకుల నుంచి దాదాపు రూ. వెయ్యి కోట్ల ఆస్తులను ఇప్పటికే రికవరీ చేసుకున్నామన్నారు. చాంద్రాయణగుట్టలో ఎంఐఎం కార్పొరేటర్ స్థలాన్ని స్వాధీనపరుచుకున్నామని తెలిపారు. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకునే విషయంలో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తుందన్నారు. తాము సామాజిక ప్రయోజనాలను కూడా పరిగణనలోకి తీసుకుంటామని కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు.

# హైదరాబాద్‌లో కల్తీ కల్లు కలకలం

ఇంటికి వెళ్లాక బొజ్జయ్య(55) అనే వ్యక్తి సాయంత్రం చనిపోయాడు. దీంతో కూకట్ పల్లి పోలీసులకు కుటుంబసభ్యులు సమాచారమిచ్చారు. బుధవారం ఉదయం గాంధీ ఆసుపత్రిలో సీతారాం అనే వ్యక్తి చికిత్స పొందుతూ చనిపోగా, హోలిస్టిక్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ స్వరూప అనే మహిళ రాత్రి చనిపోయింది. ఉదయం స్వరూప కుటుంసభ్యులు అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు. అయితే స్వరూప కల్తీ కల్లు తాగడంతోనే మృతి చెందిందని నిర్ధారించుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టమ్ కోసం గాంధీ ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఈ ఘటనలో అస్వస్థతకు గురైన 22మంది బాధితులకు నిమ్స్ చికిత్స అందిస్తున్నట్లు వైద్యాధికారులు ప్రకటించారు. చికిత్స పొందుతున్న వారిలో గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. వీరిలో ఇద్దరికి డయాలసిస్ చేయాల్సి ఉందన్నారు.

ఇంకా ప్రైవేటు ఆసుపత్రిల్లో చికిత్స పొందుతున్న వారికి సంబంధించిన వివరాలపై స్పష్టత లేదు. కల్తీ కల్లు ఘటనపై కేపీహెచ్బీ పోలీసులు కేసు నమోదు చేసి కల్లు కాంపౌండ్కు చెందిన ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో నగేష్ గౌడ్, బట్టి శ్రీనివాస్ గౌడ్, టి. శ్రీనివాస్ గౌడ్, టి.కుమార్ గౌడ్, తీగల రమేష్ ఉన్నారు. వీరికి చెందిన ఐదు కల్లు దుకాణాలను, 600 లీటర్ల కల్లును ఎక్సైజ్ అధికారులు సీజ్ చేసి ల్యాబ్కు పంపించారు. కల్తీ కల్లు తాగి తీవ్ర అస్వస్థతకు గురైన వారిని ఉదయం ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. ఘటనకు కారణమైన కల్లు కాంపౌండ్‌ను సీజ్ చేసినట్టు ఆయన వెల్లడించారు.

ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని జూపల్లి వివరించారు. నగరంలోని కూకట్పల్లిలో పలు కల్లుకాంపౌండ్లలో ఆదివారం ఉదయం పలువురు కల్లు సేవించారు. ఆరోజు బాగానే ఉన్నప్పటికీ సోమవారం ఉదయం నుంచి క్రమంగా బీపీలో హెచ్చుతగ్గులు, స్పృహకోల్పోవడం, విరోచనాలు, వాంతులతో అచేతనంగా మారి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిని వెంటనే కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. వచ్చిన వారంతా కల్లు సేవించడంతోనే అస్వస్థతకు గురైనట్లుగా తెలుసుకున్న ఆసుపత్రి సిబ్బంది దీనిపై పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, వైద్య ఆరోగ్య సిబ్బంది హాస్పిటల్కు చేరుకుని విచారణ చేపట్టారు. బాధితులంతా హైదర్‌నగర్, ఎల్లమ్మ బండ, తదితర ప్రాంతాలకు చెందినవారని అధికారులు గుర్తించారు.

ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
హైదరాబాద్ గురువారం 10, జులై 2025
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

# శామీర్ పేట ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్
# కార్యాలయా ప్రారంభోత్సవ మహెూత్సవం

## టియూడబ్ల్యూజే మేడ్చల్ జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాల్ రాజు





**శామీర్ పేట జూలై 9(ప్రజా స్వరం):** సమాజంలో సోషల్ మీడియా ప్రభావం ఎంతున్నా ప్రింట్ మీడియా విలువ తగ్గలేదని పత్రికల విలువ శాశ్వతంగా ఎప్పుడు ఉంటుందని టియూడబ్ల్యూజే మేడ్చల్ జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాల్ రాజు అన్నారు. ఉమ్మడి శామీర్ పేట మండల ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ నూతన కమిటీ అధ్యక్షుడు క్యాతం రవి ఆధ్వర్యంలో బుధవారం శామీర్ పేట ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ కార్యాలయా ప్రారంభోత్సవ మహెూత్సవం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగామేడ్చల్ జిల్లా టీయూడబ్ల్యూజే అధ్యక్షులు గడ్డమీది బాలరాజ్, ప్రధాన కార్యదర్శి వెంకటరామిరెడ్డిలు హాజరయ్యారు. మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నరసింహులు యాదవ్, శామీర్ పేట సీఐ శ్రీనాథ్, జీనోమ్ వ్యాలీ ఎస్ హెచ్ ఓ వెంకటరెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ డాక్టర్ రామిడి మధుకర్ రెడ్డి, జిల్లా ఆర్టిఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డిలతో కలిసి ప్రెస్ క్లబ్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజె జిల్లా అధ్యక్షులు బాలరాజ్ మాట్లాడుతూ... ఉమ్మడి శామీర్ పేట మండల ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ నూతన కమిటీ అధ్యక్షులు క్యాతం రవికి, కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. శామీర్ పేట సీఐ శ్రీనాథ్ మాట్లాడుతూ.... ప్రెస్ క్లబ్ అనేది ఫోర్త్ ఎస్టేట్ అని రాజ్యాంగంలో కూడా మీడియా పాత్ర గురించి ప్రస్తావించారని సమాజంలో ఏం జరుగుతుందో తెలువాలంటే విలేకరుల పాత్ర లేకుండా అది సాధ్యం కాదని ప్రతి రంగంలో మనుషులు పొరపాట్లు జరుగుతాయని శృతి మెత్తగా వాటిని పరిష్కరించుకోవాలని అన్నారు నూతన కమిటీకి ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు అంతేగాక పోలీస్ వ్యవస్థను డిమాండ్ సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది అన్నారు. జీనోమ్ వ్యాలీ సీఐ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో మీడియా అనేది ప్రముఖ పాత్ర పోషిస్తుందని ప్రపంచంలో ఎక్కడ ఏ సమస్య జరిగిన ప్రపంచానికి తెలియజేసే ఇదే మీడియాని నిజం నిర్భయంగా వెలికి తీసేది మీడియాని అన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ నా మిత్రుడు కృతం రవి ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కావడం చాలా సంతోషంగా ఉందని ప్రభుత్వం తరఫున విలేకరులకు ప్రెస్ క్లబ్ కు ఏం కావాలన్నా నావంతు సహకారం ఉంటుందన్నారు. జిల్లా ఆర్టిఏ మెంబర్ జైపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా మీడియా తన వంతు పాత్ర పోషిస్తుందని అన్నారు. ప్రెస్ క్లబ్ కార్యాలయానికి స్థలం కేటాయించడానికి తన కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నేను వివిధ స్థాయిల్లో ఎదగడానికి సహకరించిన మీడియాకు విలేకరులందరికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి మాట్లాడుతూ శామీర్ పేట విలేకరులు అందరితో మమేకమై విలువలతో కూడిన జర్నలిజం చేయడంలో ఉమ్మడి శామీర్ పేట మండలం విలేకరులు ముందు ఉంటారని వేరే ప్రాంతం విలేకరులకు ఇక్కడి విలేకరులకు చాలా వ్యత్యాసం ఉంటుందని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో కూడా విలేకరులు తన కలంతో ప్రపంచానికి తెలంగాణ సమస్య ఏర్పాటు వాదం గురించి తెలియజేశారని అన్నారు. అదేవిధంగా అధికారుల దృష్టికి ప్రజల సమస్యలను తీసుకెళ్తే తొందరగా పరిష్కారం అవుతాయని ఎదుగుతున్న లీటర్ల కూడా మీ ప్రోత్సాహం కావాలని అన్నారు.యువ నాయకులు క్యాతం మధుకృష్ణ మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రవి ప్రెస్ క్లబ్ కు 20 కుర్చీలు కావాలంటే ఇవ్వడం జరిగిందని, అదేవిదంగా ప్రెస్ క్లబ్ కు ఎలాంటి సహకారం కావాలన్నా అందిస్తానని అన్నారు. కాళోజీ అన్నట్టు మహాకవి కాళోజి గారు అన్నట్టు ఒక అక్షరం సిరా చుక్క 100 మెదళ్లకు సమానమని అన్నారు. ఈ కార్యక్రమంలో శామీర్ పేట మండలం బీఆర్ఎస్ అధ్యక్షులు సరసం మోహన్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు శంకర్ గౌడ్, శామీర్ పేట డిఐ రాజు, సబ్ ఇన్స్పెక్టర్లు, ఇంటలిజెన్స్ రవీందర్, ఏఎంసి డైరెక్టర్ శ్వేత, కాంగ్రెస్ నేత రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### వన మహెూత్సవం సందర్భంగా
## మొక్కలు నాటిన అఫ్జల్ ఖాన్



**శామీర్ పేట జూలై 9(ప్రజా స్వరం)** శామీర్ పేట్ లో సీనియర్ ఉద్యమ కారులు కాంగ్రెస్ నాయకులు మహ్మద్ అఫ్జల్ ఖాన్ విన మహెూత్సవం సందర్భంగా తన గార్డెన్ లో మొక్కను నాటారు. ఈ సందర్భంగా అఫ్జల్ ఖాన్ మాట్లాడుతు ప్రతి ఒక్కరు వీలైనన్ని మొక్కలు నాటి వాతావరణ కాలుష్య నివారణకు పాటు పాడాలని కోరారు. వన మహెూత్సవం సందర్భంగా మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల తో కలిసి మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో అఫ్జల్ ఖాన్ తో పాటు నాయకులు ఉపాధ్యాయులు పి నర్సింహా రెడ్డి మహ్మద్ నిసార్ అహ్మద్, పారిశుద్ధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సి సి రోడ్డు ఏర్పాటు చేయాలి






శామీర్ పేట జూలై 9(ప్రజా స్వరం): మా కాలనీలకు రోడ్డు ఏర్పాటు చేయాలని తూముకుంట మున్సిపల్ కార్యాలయంలో బెస్త రాము వినతిపత్రం అందజేశారు. బుధవారం సాయి నగర్ కాలనీ, లేక్ వ్యూ కాలనీలలో సిసి రోడ్ ఏర్పాటు కొరకు మున్సిపల్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. తుంకుంట మున్సిపల్ సాయినగర్ కాలనీ, లేక్ వ్యూ కాలనీలలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని, వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. వర్షాకాలంలో మోకాలు మట్టు నీటితో కాలనీవాసులము ఇబ్బందులు పడుతున్నామని వినతి పత్రంలో పేర్కొన్నారు. వెంటనే ఈ రెండు కాలనీలలో సిసి రోడ్డు ఏర్పాటు చేసి కాలనీవాసుల ఇబ్బందులను తొలగించాలని కాలనీవాసులు కోరారు.

## ప్రశ్నించే వారికి పార్టీ అండగా ఉంటుంది

**- మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి**




**మెదక్ రామాయంపేట ( ప్రజాస్వరం) :** రామయంపేట్ మండలంలో సోషల్ మీడియా వేదికగా నియోజకవర్గ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, హనుమంతరావులను ప్రశ్నించినందుకు మెదక్ జిల్లా, రామాయంపేట పోలీసులు కేసు నమోదు చేసిన బీఆర్ఎస్ నాయకులు చిట్టిమల్లి నరేందర్ రెడ్డి, బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్ శ్రీకాంత్ సాగర్‌లకు మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి గారు అండగా నిలిచారు. కేసు నమోదు విషయం తెలుసుకున్న పద్మ దేవేందర్ రెడ్డి, బుధవారం రామాయంపేట బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఇరువురిని కలిసి, జరిగిన విషయంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారికి ధైర్యం చెబుతూ, ప్రశ్నించే వారికి దేనికైనా, పార్టీ మీకు అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రామాయంపేట మున్సిపల్ తొలి చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్, పీఏసీసీ చైర్మన్ బాదే చంద్రం, నిజాంపేట మండల బిఆర్ఎస్ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు ఉమామహేశ్వర్, బసన్నపల్లి రాజు యాదవ్, పోచమ్మల ఐలయ్య, భూమ మల్లేశం, కన్నాపురం కృష్ణ గౌడ్, చింతల రాములు, పోల్కం నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

## పటాన్‌చెరు పెద్ద ఎత్తున ర్యాలీ

పటాన్‌చెరు, : రద్దు చేయాలని దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా పటాన్చెరులో కార్మికులు బుధవారం పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో కార్మికులు, సిఐటియు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ఆదిలాబాద్,: ఆదిలాబాద్ పట్టణంలోని నేతాజీ చౌక్ వద్ద అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు భారతమాత చిత్రపటానికి నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి జెండా ఆవిష్కరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోద్ మాట్లాడుతూ.. విద్యార్థులలో దేశభక్తి, క్రమశిక్షణ, జాతీయ భావాలతో పాటు, సామాజిక సేవ కార్యక్రమాల్లో ఏబీవీపీ ముందుందన్నారు. జిల్లా కన్వీనర్ నిఖిల్, తదితరులున్నారు.

## ప్రతి ఒక్కరు సేవా భావం కల్గి ఉండాలి:అఫ్జల్ ఖాన్



**శామీర్ పేట జూలై 9(ప్రజా స్వరం)** అఫ్జల్ ఖాన్ సీనియర్ ఉద్యమ కారులు కాంగ్రెస్ నాయకులు మహ్మద్ అఫ్జల్ ఖాన్ తన నివాసంలో బుధవారం అన్న దాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అఫ్జల్ ఖాన్ మీడియాతో మాట్లాడుతు సేవా కార్యక్రమాలకు లబించే తృప్తి, ఆనందం ఎందులోను లబించదని అన్నారు. అఫ్జల్ ఖాన్ మాట్లాడుతు సమాజం లో సేవా కార్యక్రమాలు చేయటం ప్రతి ఒకరి కనీస ధర్మం అని, ప్రతి ఒక్కరు ఈ దారి లో పయనించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మహ్మద్ అఫ్జల్ ఖాన్ తో పాటు నాయకులు ఉపాధ్యాయులు పి నర్సింహా రెడ్డి, మహ్మద్ నిసార్ అహ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి రాజనర్సింహకు కృతజ్ఞతలు తెలిపిన కనిగిరి లింగం



మనోహరాబాద్ (ప్రజాస్వరం ) : తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ను ఆయన నివాసంలో రాష్ట్ర మాజీ పీసిసి రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ రీజినల్ కన్వీనర్ కనిగిరి లింగం, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సాయి కుమార్ లు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. మెదక్ జిల్లాలోని నర్సాపూర్, తూప్రాన్ మండలాల్లోనీ ప్రభుత్వ ఆసుపత్రిలో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. డయాలసిస్ కేంద్రాలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రావడంతో డయాలసిస్ రోగులకు ఎంతో మేలు జరిగిందని ఇప్పటికే 1000 మందికి పైగా రోగులు డయాలసిస్ సేవను వినియోగించుకోవడంతో మంత్రి ని కలిసి ఆయన కృషిని కొనియాడుతూ కృతజ్ఞతలు తెలియజేశారు. సామాన్య ప్రజలకు చేరువగా వైద్యసేవలు అందిస్తుండడం పై హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద అన్నప్రసాదం వితరణ



శామీర్ పేట, జూలై 9 (ప్రజా స్వరం) : శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద ఘనంగా అన్నదానం చేపట్టారు. బుధవారం శామీర్ పేట మండలం తూంకుంట మున్సిపల్ ఉప్పర్ పల్లి పరిధిలోని శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద శామీర్ పేట మండలం బొమ్మ రాసి పేటకు చెందిన రిహాన్సీ రెడ్డికి అన్నప్రాసన సందర్భంగా సింగిరెడ్డి నరసింహారెడ్డి, ఇంద్ర(మాజీ ఎంపీటీసీ) దంపతుల కుమారుడు కార్తీక్ రెడ్డి, నిహారిక దంపతుల కూతురు రిహాన్సీ రెడ్డి ఆనంద్ రెడ్డిలు అన్నదానం చేపట్టారు. వివిధ గ్రామాల భక్తులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.

ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక
మేడ్చల్, రంగారెడ్డి, వికారాబాద్
హైదరాబాద్ గురువారం 10, జులై 2025

# లేబర్ కోడ్ లను రద్దు చేయాలి

కోదాడ, : కార్మికులు పోరాటాలు చేసి సాధించుకున్న చట్టాలను కేంద్రంలోని అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం కాల రాస్తుందని సీపీఎం మండల కార్యదర్శి బెల్లం కొండ సత్య నారాయణ అన్నారు. బుధవారం సార్వత్రిక సమ్మెను పురస్కరించుకొని మండల కేంద్రంలో కార్మిక సంఘాలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. గీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, సీఐటీయు మండల కన్వీనర్ వెంకన్న, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కిషోర్ ఉన్నారు.

# అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

బాల్కొండ, : బాల్కొండ నియోజకవర్గంలోనికిసాన్ నగర్, ముప్కాల్ గ్రామంలో రూ. 20 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ప్రారంభించారు. బీఆర్ ఎస్ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా 65 వేల గ్రామ పంచాయతీలను నిర్మించినట్లు చెప్పారు.

# ఎస్సారెస్పీలోకి 4781 క్యూసెక్కుల వరద

బాన్సువాడ, : ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో మెండోరా మండలంలోని పోచంపాడ్ లోని ఎస్సారెస్పీకి 4781 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తోంది. కాకతీయ కాలువ ద్వారా 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, మిషన్ భగీరథ అవసరాలకు 231 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ఆవిరి రూపంలో 323 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(80. 5 టీఎంసీలు) అడుగులు కాగా బుధవారం ఉదయంకు 1067. 60 (19. 5 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

# కల్తీ కల్లు బాధితుల్లో ముగ్గురు మృతి

కూకట్‌పల్లి, : హైదరాబాద్ కూకట్‌పల్లిలో కల్తీ కల్లు తాగిన 40 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. బుధవారం కల్తీ కల్లు బాధితుల్లో ముగ్గురు మృతి చెందారు. గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇద్దరు, ఇంట్లోనే ఉన్న మరో వ్యక్తి మృతి చెందాడు. మృతులు తులసిరామ్ (47), బొజ్జయ్య (55), నారాయణమ్మ (65)గా గుర్తించారు. మృతులంతా హెచ్ఎంటీ హిల్స్ సాయిచరణ్ కాలనీకి చెందిన వారు.

# ఉప్పల్ స్టేడియం వద్ద కాంగ్రెస్ కార్యకర్తలతో వీహెచ్ ధర్నా

ఉప్పల్, : ఉప్పల్ స్టేడియం వద్ద కాంగ్రెస్ కార్యకర్తలతో వీహెచ్ హనుమంత రావు బుధవారం ధర్నా నిర్వహించారు. గేట్ నెంబర్ 6, 7 గేట్స్ నుండి స్టేడియం లోపలకి వెళ్లకుండా గోడ నిర్మాణం చేపట్టారు. ఓ ప్రైవేటు కంపెనీ మా స్థలం అంటూ గోడ నిర్మాణం చేపట్టారు. వెంటనే జీహెచ్ఎంసీ అధికారులు వచ్చి గోడను కూల్చాలని అని విహెచ్ డిమాండ్ చేశారు. ఈ గోడ కట్టడం వాళ్ళ క్రికెట్ అభిమానులు స్టేడియం లోపాలకి వెళ్లకుండ ఇబ్బంది పడుతారని అన్నారు.

# రౌడీ షీటరు దారుణ హత్య

**విశాఖపట్నం** విశాఖ నగరంలో ఒక రౌడీ షీటర్ దారుణ హత్యకు గురయ్యాడు. మాధవధార కుంచమాంబ అమ్మవారి పండగలో మంగళవారం అర్ధరాత్రి ఇద్దరు యువకుల మధ్య వాగ్వాదం జరిగింది. కత్తులతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ముందస్తు ప్లాన్ ప్రకారమే దాడికి దిగినట్టు స్థానికులు వెల్లడించారు. మృతుడు మాసపు లోహిత్ (22) నేర చరిత్ర కలిగిన రౌడీ షీటరు గా గుర్తించారు. ఎయిర్ పోర్టు పోలీసులు నలుగురు యువకులను అదుపులో తీసుకున్నట్లు సమాచారం.

# సింహాచలంలో గిరి ప్రదర్శన ప్రారంభం





**విశాఖపట్నం** విశాఖ సింహాచలం కొండ దిగువన తొలిపావంచా వద్ద నుంచి గిరిప్రదక్షిణం ప్రారంభమైంది. స్వామి వారి నమూనా విగ్రహంతో పుష్పరథం కదిలింది. రథాన్ని ఆలయ అనువం శిక ధర్మ పూసపాటి అశోక్ గజపతి రాజు జెండా ఊపి ప్రారంభించారు. రథం వెంట లక్షలాది మంది భక్త జనం గిరి ప్రదక్షిణకు శ్రీకారం చుట్టారు.గిరి ప్రదక్షిణ చేస్తే భూమి ప్రారక్షణ చేసిన అంత పుణ్యఫలం లభిస్తుం దని పురాణాలు చెబుతున్నాయి. అంతటి మహోన్నతమైన సింహా చలం గిరి ప్రదక్షిణ మహోత్సవానికి సమయం ఆసన్నమైంది. ఆషాధ పౌర్ణమి సందర్భంగా చతుర్దశి నాడు లక్షలాది మంది భక్తులు సింహగిరి ప్రదక్షిణ చేయడం ఆనవాయితీ. అందుకు తగ్గ ఏర్పాట్లు చేసింది అధికార యంత్రంగం. గతంలో అనుభవాల నేపథ్యంలో ఎటువంటి అవాంతరాలు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. ప్రత్యేక ఆషాడ పౌర్ణమి సందర్భంగా చతుర్దశి నాడు గిరిప్రదక్షిణ చేయడం ఆనవాయితీ. 32 కిలోమీటర్ల దూరం సింహగిరి చుట్టూ ప్రదక్షిణ చేసి స్వామివారిని దర్శించుకుంటే కలిగే భాగ్యమే వేరని భక్తులు నమ్ముతూ ఉంటారు. సింహాచలేశ్వరుడు కొలువుదీరిన సింహగిరి చుట్టూ ప్రదక్షిణ చేస్తే భూమి ప్రదక్షిణ చేసినంత పుణ్యఫలం లభిస్తుందని నమ్మకం. అందుకే ప్రతీయేటా లక్షలాదిమంది భక్తులు కాలినడకన 32 కిలోమీటర్లు ప్రదక్షిణ చేస్తారు.

## తలసాని యువసేన ఆధ్వర్యంలో

# క్రికెట్ పోటీలు ప్రారంభం

**హైదరాబాద్** మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ బుధవారం అమీర్ పేట లోని మున్సిపల్ గ్రౌండ్ లో తలసాని యువసేన ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలను ప్రారంభించారు. తలసాని శంకర్ యాదవ్ జ్ఞాపకార్థం క్రికెట్ పోటీల నిర్వహించారు. బుధవారం నుంచి ఈ నెల 12 వరకు క్రికెట్ పోటీలు జరగనున్నాయి. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల కూడా ఆసక్తి చూపాలి. ప్రతిభను చాటేందుకు క్రీడా పోటీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

# నేడు జాతీయ మత్స్య రైతుల దినోత్సవం

చేపల ప్రోటీన్ కోసం పెరుగుతున్న డిమాండ్ ను తీర్చడంలో, ఉపాధి అవకాశాలను సృష్టించడంలో , దేశ ఆహార భద్రతకు దోహదం చేయడంలో చేపల రైతులు పోషించే ముఖ్యమైన పాత్రను గుర్తించడానికి జాతీయ చేపల రైతు దినోత్సవం ఒక ముఖ్యమైన వేదికగా పనిచేస్తుంది.సుస్థిరమైన , అభివృద్ధి చెందుతున్న మత్స్య రంగం అభివృద్ధి కోసం చేపల రైతులు, ఆక్వాకల్చర్ పరిశ్రమ నిపుణులు ఇతర భాగస్వాముల అమూల్యమైన కృషిని గుర్తించడానికి , ప్రశంసించడానికి ప్రతి సంవత్సరం జూలై 10 న జాతీయ మత్స్య రైతుల దినోత్సవం నిర్వహిస్తున్నారు.జాతీయ మత్స్య రైతుల దినోత్సవం 2023 చేపల రైతుల అపారమైన కృషిని , సుస్థిర ఆక్వాకల్చర్ పట్ల వారి నిబద్ధతను గుర్తించడానికి యావత్ దేశానికి ఒక అవకాశం. బాధ్యతాయుతమైన పద్ధతులను అవలంబించడం ద్వారా, మత్స్య రంగం సామర్థ్యాన్ని ఉపయోగించుకోవడం ద్వారా, మనం సుసంపన్నమైన భవిష్యత్తును నిర్ధారించవచ్చు, ఆహార భద్రతను పెంచవచ్చు. దేశ సమగ్ర అభివృద్ధికి దోహదపడవచ్చు.1957 లో ఇదే రోజున హైపోఫిసేషన్ టెక్నిక్ ద్వారా భారతీయ మేజర్ కార్ప్స్ లో ప్రేరిత సంతానోత్పత్తి , పునరుత్పత్తికి మార్గనిర్దేశం చేసిన భారతీయ మత్స్య రంగ ప్రొఫెసర్ డాక్టర్ హీరాలాల్ చౌదరి , ఆయన సహచరుడు డాక్టర్ కె.హెచ్.అలీకున్హి చేసిన కృషిని గౌరవించడానికి , జ్ఞాపకం చేసుకోవడానికి జాతీయ మత్స్య పరిశ్రమాభివృద్ధి సమాఖ్య(ఎన్ఎఫ్ఎఫ్ డి ) జాతీయ చేపల రైతు దినోత్సవం నిర్వహిస్తోంది. జరుపుకుంటారు, వారి కృషి అంతిమంగా చివరికి ఇన్ లాండ్ ఆక్వాకల్చర్ లో విప్లవానికి దారితీసింది. చేపల పెంపకందారులు, ఆక్వాప్రెన్యూర్లు (ఆక్వా వ్యవసాయ రంగంతో సంబంధం ఉన్న వ్యాపారవేత్తలు) , మత్స్యకారులు దేశ మత్స్య రంగం అభివృద్ధికి చేసిన కృషిని గుర్తించడం , మన మత్స్య వనరులను సుస్థిరంగా నిర్వహించే మార్గాలను సమిష్టిగా ఆలోచించడానికి, చర్చించడానికి ఒక పర్యావరణ వ్యవస్థను సృష్టించడం ఈ దినోత్సవాన్ని జరుపుకోవడం ముఖ్య ఉద్దేశ్యం. చేపల ప్రోటీన్ కోసం పెరుగుతున్న డిమాండ్ ను తీర్చడంలో, ఉపాధి అవకాశాలను సృష్టించడంలో , దేశ ఆహార భద్రతకు దోహదం చేయడంలో చేపల రైతులు పోషించే ముఖ్యమైన పాత్రను గుర్తించడానికి జాతీయ చేపల రైతు దినోత్సవం ఒక ముఖ్యమైన వేదికగా పనిచేస్తుంది. ఆధునిక ఆక్వాకల్చర్ పద్ధతులను అవలంబించడంలో, చేపల ఉత్పాదకతను మెరుగుపరచడంలో , జల వనరులను సంరక్షించడంలో వారి అంకితభావం , ఆవిష్కరణను ఇది చాటి చెబుతుంది. కొన్నేళ్లుగా, శాస్త్రీయ పరిశోధన , సాంకేతిక జోక్యాలతో మత్స్య రంగం గణనీయమైన పురోగతిని సాధించింది.ఈ సందర్భంగా, విజ్ఞానాన్ని వ్యాప్తి చేయడానికి, అనుభవాలను పంచుకోవడానికి , భాగస్వాముల మధ్య సహకారాన్ని పెంపొందించడానికి దేశవ్యాప్తంగా సెమినార్లు, వర్క్ షాప్ లు, ఎగ్జిబిషన్ లు, ఇంటరాక్టివ్ సెషన్ లు వంటి వివిధ కార్యకలాపాలను నిర్వహిస్తారు. మత్స్య రంగానికి చెందిన నిపుణులు, వృత్తి నిపుణులు ఆక్వాకల్చర్ లో తాజా పరిణామాలు, పరిశోధన ఫలితాలు, నూతన ధోరణులపై అవగాహన కల్పిస్తారు

# ప్రసన్న కుమార్ రెడ్డిపై కేసు నమోదు

**నెల్లూరు** మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి పై కోవూరు పోలీస్ స్టేషన్ లో పలు సెక్షన్ల కింద కేసు నమోదు అయింది. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పై చేసిన అనుచిత వ్యాఖ్యలపై అందిన ఫిర్యాదుతో కేసు నమోదు అయింది. పోలీసులు సెక్షన్ 74, 75, 79, 296 కింద కేసు నమోదు చేసారు. ఈ నేపథ్యంలో ప్రసన్నకు నోటీసు జారీ చేసి విచారించే అవకాశం వుంది...

# బంగారుపాళ్యంలో హై టెన్షన్

**చిత్తూరు** బంగారు పాళ్యంలో బుధవారం హై టెన్షన్ వాతావరణం నెలకొంది. పర్యటనలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కాన్వాయి దిగేందుకు ప్రయత్నం చేసారు. వైసీపీ కార్యకర్తలను పోలీసులు కొట్టారని కారు దిగి.. గాయపడ్డ కార్యకర్త దగ్గరికి వెళ్లేందుకు జగన్ ప్రయత్నం చేసారు. జగన్ను కాన్వాయ్ దిగకుండా ఎస్పీ మణికంఠ చందోలు అడ్డుకున్నారు.

# సచివాలయంలో జన్మదిన వేడుకలు




**పెనుమంట్ర** ప్రజలకు సేవలందించాల్సిన సచివాలయంలో జన్మదిన వేడుకలు జరిపిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పెనుమంట్ర మండలం పెనుమంట్ర పరిధిలో బ్రాహ్మణ చెరువులో ఆదివారం రాత్రి ఇది చోటుచేసుకుంది. సాంఘిక సంక్షేమ, వ్యవసాయ శాఖలో వేరువేరు సచివాలయాల్లో పనిచేస్తున్న దంపతుల కుమారుడి మొదటి పుట్టినరోజు వేడుకలను తల్లి ఇన్చార్జిగా చేస్తున్న పెనుమంట్ర- 2 సచివాలయం భవనం లో ( పాత వసతి గృహం ) నిర్వహించారు. లోపల వేదిక ఏర్పాటు చేసి, మరో మరోపక్క భోజనాలు పెట్టారు. విద్యుత్ దీపాలంకరణ చేశారు. మండల పరిధిలోని సచివాలయ ఇతర శాఖలు ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారుని సమాచారం.వాస్తవానికి ప్రభుత్వ కార్యాలయంలో ప్రైవేటు కార్యక్రమాలు నిర్వహించకూడదు. దీనిపై అధికారులు ఎలా స్పందిస్తారో ఏం చర్యలు తీసుకుంటారో చూడాలి మరీ

# ఆటో బోల్తా:పలువురికి గాయాలు

**తిరుపతి** గూడూరు రూరల్ పరిధిలో ఆటో బోల్తా పడిన ఘటనలో పలువురికి స్వల్ప గాయాలు అయ్యాయి. ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం తప్పించబోయి పక్కనే ఉన్న కల్వర్టు లోకి అదుపుతప్పి ఆటో బోల్తా పడినట్టు సమాచారం. ఆటో బోల్తా సమయంలో డ్రైవర్ తో పాటు ఇద్దరు ప్రయాణికులు వున్నారు. గూడూరు నుండి విందూరు మార్గం లో రోడ్డు పై అక్కడక్కడా భారీ గుంతలు,తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహన దారులు..రాష్ట్రం లో గుంతలు లేని రోడ్లు అని చెబుతున్న పాలకులు విందూరు రోడ్డు వైపు చూడాలని స్థానికులు కోరుతున్నారు

# సుపరిపాలనలో తొలిఅడుగు

- సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం :
- తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.వి.బి.రాజేంద్ర ప్రసాద్



ఉయ్యూరు పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జంపాన గుర్నాధం ఆధ్వర్యంలో సుపరిపాలన లో తొలిఅడుగు కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ వై.వి.బి. రాజేంద్ర ప్రసాద్ తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి ఉయ్యూరు లోని 3 వార్డు సాయి మహల్ సెంటర్లో ఇంటింటికి వెళ్లి స్థానిక సమస్యలను తెలుసుకుని, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గూర్చి వివరించిన రాజేంద్రప్రసాద్ . ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ...ఎన్నికల ముందు నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో పెన్షన్ 4000 చేశారని, తల్లికి వందనం కింద మీ ఇంట్లో ఎంతమంది బడికి వెళ్లే బిడ్డలు ఉంటే అంతమందికి కూడా ఆ పథకాన్ని తల్లులు ఖాతాల్లో వేశారని, ఏడాదికి మూడు గ్లాస్ సిలిండర్లు పథకాన్ని కూడా అమలు చేశారని, ఇప్పుడు ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కూడా కల్పించడం జరుగుతుందని రాజేంద్రప్రసాద్ అన్నారు.ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ వల్లభనేని సత్యన్నారాయణ, మాజీ మున్సిపల్ చైర్మన్లు జంపాన పూర్ణచంద్రరావు, అబ్దుల్ కుద్దూస్, క్లస్టర్ ఇంచార్జి కూనపరెడ్డి శ్రీనివాసు, కౌన్సిలర్ తెనాలి పద్మావతి, మూడో వార్డు అధ్యక్షులు బొమ్మసాని సురేష్ , సయ్యద్ గఫూర్, రాష్ట్ర సగర సాధికార కన్వీనర్ జంపన శ్రీనివాస్,మైనారిటీసెల్ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ అజ్మతుల్లా,4 వార్డ్ అధ్యక్షులు సాంబశివరావు,శివాలయం చైర్మన్ కుటుంబరావు,వైద్యశాల చైర్మెన్ మండవ జయదేవ్,పార్టీ నాయకులు వంగవీటి శ్రీనివాస్ ప్రసాద్,రత్నం బుజ్జి,ఇష్ట. ప్రవీణ్,నజీర్, మురాల వెంకటేశ్వరరావు, పత్తి సాయి, బొమ్మసాని రామకృష్ణ, దేవయ్య, మల్లేశ్వరరావు, వలి, చిట్టి మోతుల సుబ్బారావు, పుట్టి చంటి, గుర్రాల సాయిబాబు, యూనిట్ ఇంచార్జ్ చలపాటి శ్రీను, భాగ్యరాజు,అప్పలనాయుడుఉయ్యూరు గణేష్,పైడియ్య, సాంబశివరావు,నరసింహారావు,సుజిత్ ఇంకా పలువురు నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## ఆర్ అండ్ బీ శాఖపై

# మంత్రి కోమటిరెడ్డి సమీక్ష

**సెక్రటేరియట్** సెక్రటేరియట్ లో రోడ్లు భవనాలు శాఖ పై మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. జాతీయ రహదారి 65 రోడ్డు పనుల పురోగతి పై అధికారులను ఆరా తీసారు. మదీనాగూడ నుండి సంగారెడ్డి వరకు 6లేన్ల రహదారి విస్తరణ పనుల పురోగతి, హ్యామ్ రోడ్ల ప్యాకేజీ ల పై చర్చ జరిగింది. ఈ సమీక్షలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్,రీజినల్ ఆఫీసర్ కృష్ణ ప్రసాద్,ఔఊ అధికారులు, ఆర్ అండ్ బి ఈఎన్సి జయ భారతి,సి.ఈ లు, ఎస్.ఈ ధర్మారెడ్డి,పలువురు ఆర్ అండ్ బి అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా రహదారుల

# అభివృద్ధికి రూ.866 కోట్లు : యార్లగడ్డ

**గన్నవరం :** గత ప్రభుత్వ నిర్వాకం వల్ల అద్వాన్నంగా మారిన రహదారుల అభివృద్ధికి తమ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా రూ.866 కోట్లు ఖర్చు చేసినట్లు ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. సూపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం లో భాగంగా గన్నవరం మండలం గోపవరపు గూడెం, కట్టుబడిపాలెం, ముదిరాజుపాలెం గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ ఏడాది కాలంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరిస్తూ రూపొందించిన కరపత్రాన్ని, గన్నవరం నియోజకవర్గంలో తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన తరువాత ఈ ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ రూపొందించిన కరపత్రాన్ని ప్రజలకు పంపిణీ చేశారు. సంక్షేమ పథకాల అమలుతీరును లబ్ధిదారులు అడిగి తెలుసుకున్నారు. స్థానికుల సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ తాము అధికారం చేపట్టే నాటికి రాష్ట్ర వ్యాప్తంగా రహదారులన్నీ చిద్రమై గుంటలుగా మారడంతో పాటు కొన్నిచోట్ల చేపల చెరువులను తలపించే రీతిలో ఉన్నాయని, ఈ అద్వాన్న రహదారులతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారం చేపట్టిన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా రహదారుల మరమ్మతులకు, పూర్తిగా దెబ్బతిన్న వాటిని పునర్నిర్మించేందుకు రూ.866 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. గన్నవరం నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి రూ. 20.76 కోట్లు వెచ్చించినట్లు చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో భాగంగా తల్లికి వందనం పథకం ద్వారా ఇప్పటికే తల్లులు ఖాతాలో నిధులు జమ అయినట్లు గుర్తు చేశారు. అవినీతి అక్రమాలకు నెలవు గా మారిన రాష్ట్రంలో వాటిని పారదోలి సుపరిపాలన అందిస్తున్నట్లు పేర్కొన్నారు. తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గన్నవరం నియోజకవర్గంలో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు కోసం రూ. 641 కోట్లు నిధులు వెచ్చించినట్లు యార్లగడ్డ తెలిపారు. రైతుబిడ్డగా రైతుల సాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు సొంత నిధులతో మోటార్లు కొనుగోలు చేసి ఇచ్చానని గుర్తు చేశారు. గన్నవరం నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతున్నానని గన్నవరాన్ని రాష్ట్రంలోని నెంబర్ వన్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ సహకరించాలని యార్లగడ్డ కోరారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు గూడపాటి తులసి మోహన్, టిడిపి నాయకులు చిరుమామిళ్ల సూర్యం గ్రామ టీడీపీ పార్టీ ప్రెసిడెంట్ పల్లగాని రాంబాబు, మాజీ సర్పంచ్ వెంకట రత్నం, వేమూరి రవి, నల్లూరి కోటయ్య, భానుమూరి భాను ప్రకాష్, మేడేపల్లి రమ, గూడవల్లి నరసయ్య, పరుచూరి నరేష్ , తుల్లిమిల్లి ఝాన్సీ జనసేన నాయకులు, చిమట రవి వర్మ, స్వామి , బిజెపి నాయకులు, చిగురుపాటి కుమారస్వామి, నాదెండ్ల మోహన్, తదితరులు పాల్గొన్నారు.....

# మండలానికి ఐదు ఎంపీటీసీలు ఉండాల్సిందే

**!హైదరాబాద్** పంచాయతీల పునర్వ్యవస్థీకరణ ఎంపీటీసీ డీలిమిటేషన్ షెడ్యూల్ జారీరాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల పునర్వ్యవస్థీకరణ, మండల ప్రజా పరిషత్ ఎంపీటీసీ డీలిమిటేషన్ కు సంబంధించిన షెడ్యూల్‌ను జారీ చేసింది.ఈ మేరకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల డైరెక్టర్ సృజన. కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులకు సూచనలతో కూడిన సర్క్యులర్ ను జారీ చేశారు.

కొన్ని గ్రామ పంచాయతీలు సమీప మున్సిపాలిటీలో విలీనం కావడం, ఇతర పంచాయతీలలో కలపడంతో ఈ పునర్వ్యవస్థీకరణ అవసరమైంది. తెలంగాణ పంచాయతీరాజ్ సవరణ, చట్టం ప్రతీ మండల ప్రజా పరిషత్‌లో కనీసం ఐదు ఎంపీటీసీలు ఉండాలని చెబుతోంది. ఇందులో భాగంగా ప్రభావిత ఎంపీటీసీలను కొత్త ఎంపీటీసీలుగా క్రమబద్ధీకరించడం లేదా సమీపంలోని ఎంపీటీసీలలో విలీనం చేయడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు.ఎంపీటీసీ డీలిమిటేషన్ షెడ్యూల్‌ముసాయిదా ప్రచురణ: 8.07.2025అభ్యంతరాల స్వీకరణ:8.07.2025 నుంచి 9.07.2025అభ్యంతరాల పరిష్కారం:10.07.2025 నుంచి 11.07.2025తుది ప్రచురణ: 12.07.2025

# సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా పదవీ బాధ్యతలు చేపట్టిన కె. రాజేష్

**సిద్దిపేట** సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐ గా కె. రాజేష్ పదవీ బాధ్యతలు చేపట్టిన తదానంతరం మర్యాదపూర్వకంగా పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ. కలసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా సి పి అభినందించి శాంతి భద్రతలకు పెద్దపీట వేయాలని, సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి విధులు నిర్వహించాలని, గంజాయి డ్రగ్స్ ఇతర మత్తుపదార్థాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు.

%Edited, Printed, Published and Owned by PURAM MAHESHWAR Printed at HARI HARA ART PRINTERS,H.No.6-185,Toopran,Dist.Medak, Telangana-502336. and Published at H.No. 4-50/18,Kallakal, Vill-Kallakal,(PO). Kadlakal,(M) Manoharabad, Dist.Medak-Telangana -502336. Editor: PURAM MAHESHWAR. RNI. No:TELTEL/2006/17154. Cell:800860999